
మిస్ శారద
మిస్టర్ మదన్...
'శ్రీ సుభా'

*'మీ కంటి చివరి చూపు కోసం ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నాను... మీరు తప్ప నాకు ఈ లోకంలో దేనితోనూ నిమిత్తం లేదంటూ ఉత్తరం ఇవ్వాడా పేశాడు పోస్ట్‌మన్. పైగా 'మీరుమాత్రం ప్రేమించలేదా, కాదనగలరా' అని ప్రశ్నిస్తాడు, ఫూల్! 'శారదా, వాడెవడే! రామ... రామ' అని అమ్మమ్మ బాధ పడిందంటే వింత ఏముంది!*

"ప్రోస్ట్, సార్..."

వీధిలోనికి పరుగున వెళ్ళింది శారద— అల్లుకుంటున్న పొడుగాటి జడను వదిలేసి.

అబ్బ. మూడిళ్ల అవతల ఉన్నాడు. తన కీ రోజైనా ఉత్తరం వస్తుందా?

ఆ రోజా ఇంటి కాలేజీ అమ్మాయికి రోజూ ఉత్తరాలు వస్తాయి. ఎవరు వ్రాస్తుంటారో? ఒకవేళ ప్రేమలేఖలేమో? నవ్వొచ్చింది. తను కాలేజీలో చదువుకునే రోజుల్లో కూడా, నాన్న దగ్గర నుంచి ఉత్తరంకోసం ఎదురుచూస్తుంటే ఎవడో ఒకడు విరహం వెళ్ళగక్కుతూ వ్రాసే ప్రేమలేఖ అందేది. ఏడుపు, నవ్వుకూడా వచ్చేది. ఇలా వీళ్ళ డబ్బును వ్యయంచేస్తుంటే, ప్రభుత్వానికి పరోక్షంగా సహాయం చేస్తున్నారనిపించేది. వాళ్ళ పరీక్షలు పాస్ అయ్యారో లేదో, ఇప్పటికైనా—

ఆయనమాత్రం తనకెన్ని ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవారో పెళ్ళికానిపూర్వం? తన కెందుకో ఆ ఉత్తరాలు చింప బుద్ధివేసేదికాదు. చదవకూడదనుకుంటూనే పొంతం చదివేది. "ప్రేమించాను... నిన్ను తప్ప మరొకర్ని చేసుకోను..." సారాంశం అయినా ఎంతో పొందిగ్గా వ్రాసేవారు. ఆ ఉత్తరాలు మొదట్లో ఆకర్షిస్తూ అలా అలా తనను ఆకట్టుకున్నాయి. ఆ చెప్పలేని మమతే అలా ఎదిగి ఏరులై, కోనేరులై, గోదావరులై అనాలోచితంగానే తనను వివాహానికి ఒప్పించింది...

తను ఆమాటే అంటే ఆయన నవ్వుతూ అనేవారు—

"శారదా, నువ్వు మొదట్లోనే నా ఉత్తరాలు చించి పారేసిఉంటే నేను నిన్ను పొందేవాణ్ణి కానన్నమాట"—అని. ఏమో తను జవాబు చెప్పేది కాదు. కాదు, చెప్పలేదు.

అలాంటి ఆయన ఈ ఏడాదిలో తనకెన్ని ఉత్తరాలు వ్రాశారు? లెక్కగా వచ్చాయి. అంతే. తను రోజూ ఎదురుచూడ్డం, రాకపోవడం, నిజంగా ఈ ఏడాదిలో నిస్పృహల నిష్పత్తే ఎక్కువ! అలాగే ఓసారి తను వ్రాసిన గుర్తు.

"మీ దగ్గరనుంచి ఉత్తరంకోసం రోజూ ఎదురు చూస్తాను. 'ఇంకా ఏమిటీ పిచ్చ'ని నవ్వుకుంటున్నారు కదూ? ఎందుకో ఉత్తరం వచ్చిన నాడు మిమ్మల్ని చూచినట్టవుతుంది. ఈ ఒంటరితనాన్ని క్షణం మర్చిపోతాను. కానీ, ఈ అనుభూతికి నేనేం కారణం చెప్పుకోలేకపోతున్నాను..."

తనకు ఉత్తరం వచ్చినా, అత్తయ్య, మావయ్య, వదిన, అమ్మ, నాన్న, చెల్లాయిలే అందులో ఒకటికి పదిసార్లు కన్పించేవారు. తనకు కావల్సిందేదో లేదనిపించేది. అయినా మగ వాళ్ళకు బాధ పెట్టడం చేతనయినట్టుగా మరేం తెలియదు.

అసలు ఆ విశాఖపట్నం చదువంటేనే తనకు భయం. పట్టి కాస్మొపొలిటన్ కల్చర్. ఎంత మంది ఆడపిల్లలు, లేడీ ప్రొఫెసర్స్ టిప్‌టాప్‌గా, గ్లామరస్‌గా యూనివర్శిటీకి వస్తారు? వాళ్ళలో ఎవరో ఆయన్ను...ఛీ. నవ్వొచ్చేది.

ఈ లోకంలో ఆడవాళ్ళంతా మాయమయిపోయి తనొకతే ఆయనకోసం మిగలకూడదూ? అనే ఆలోచన. ఆయన అటువంటి వారు కారు.

దృఢతరం చేసుకునేది మనస్సును, గాలిపటంలా ఎగురుతూ ఉంటే....

అదిగో పక్కింటి పిన్నిగారు నవ్వుకుంటూ ఉత్తరం అందుకుంటూంది. అలా తనవైపు చూసి నవ్వుతుందెందుకూ?

పోస్ట్‌మన్ గేట్ దగ్గర సైకిల్ ఆపాడు. లోపలికి వస్తున్నాడు. అడగాలనిపించింది. భయంఏ జవాబు వినవలసి వస్తుందోనని.

"సుబ్బలక్ష్మమ్మగారూ, ఉత్తరం అండి...."

పక్క వాటాలో వాళ్ళకు ఇచ్చాడు. తనను చూడలేదా? 'పోనీ మీకు లేవండీ అని చెప్ప కూడదూ?' వెధవ సస్పెన్స్. వెళ్ళిపోతున్నాడు. తన కనుమానం—ఆ ఉత్తరాలకట్టలో తన ఉత్తరం ఏమూల నలిగిపోతూందోనని. హఠాత్తుగా అడిగింది.

"మాకేంలేవా పోస్ట్‌మన్ గారూ..."

వెనక్కు తిరక్కుండానే అన్నాడు—"ఉంటే ఇవ్వనాండీ?"—అబ్బ. ఎంత ఎగతాళి? ఉండి ఇవ్వనట్లయితే ఊరుకునేదెవరో? లేవని చెప్ప కూడదూ? సైకిల్‌బెల్ ఖంగున మ్రోగించి వెళ్ళిపోయాడు.

వెధవది. ఒక్కొక్క పోస్ట్‌మన్ అసలే ఉత్తరాలు పట్టుకురాడు. పూర్వం తను కాలేజీలో చదువుకునే రోజుల్లో సుబ్బయ్యగారు ఎన్ని, ఉత్తరాలు ఇచ్చేవాడుపాపం! నవ్వుతూ—"శారదమ్మగారూ, ఈ ఊళ్ళో కల్లా పెద్ద టపా మీ ఒక్కరిదేనమ్మా" అనే వాడు. తనకెంతో గర్వంగా ఉండేది ఆ రోజుల్లో.

రాదనుకున్ననాడు కూడా ఏదో ఉత్తరంవచ్చేది. ఇప్పుడు వస్తుందనుకొని వేయికళ్ళతో ఎదురు చూసినా...

ఇంట్లోంచి అమ్మమ్మ వచ్చింది.

"ఏమే, అతని దగ్గరనుంచి ఈ రోజైనా ఉత్తరం వచ్చిందా..." తన కసలే ఉక్రోషంగా ఉంది. ఆపుకుంటూ అంది:

"రాలేదమ్మమ్మా... రేపు వస్తుందేమో..."

"అదేమిటే? ఒక్క ఉత్తరం ముక్కయినా వ్రాయడం మానివేశాడు?"

అమ్మమ్మ అయున్నింకా ఏమన్నా అడిపోసుకుంటుందేమోనని ఆదుర్దా. మనకు ఇష్టమైన వస్తువులో ఇతరులు లోపాలెన్నడం సహించలేదు మనస్సు.

"లేదమ్మమ్మా వ్రాయకుండా ఉండరు.. పరీక్షలు జరుగుతూ ఉండాలి..."

"నాలుగైదు రోజుల క్రితం అయిపోతాయన్నావుకదే?"

లోపలినుంచి వస్తున్న కోపం, ఎగసే బాధ కొత్త స్వరం కలిపాయి....

"వెధవ పరీక్షలు ఒక్కొక్కసారి సాడిగిపోరమ్మమ్మా..."

"ఏమిటోనమ్మా. పాడుకాలం." లోపలికివెళ్ళింది అమ్మమ్మ. తనూ అచేతనంగా లోపలికి వెళ్ళడంతప్ప మరేం చేయలేకపోయింది.

గదిలో అద్దంలో తన రూపం వెంగచేత నగం చిక్కినట్టు కన్పిస్తూంది. ఆకళ్ళల్లో ఆయన అనే శోభేది? గర్వంగా ఎగిరేజుట్టు. ఈ అదిరే అధరాలు. గోడమీద ఫోటోలో దశరథరాముడు సీతా సమేతంగా నవ్వుతున్నాడు — ఎగతాళి కాదుకదా?

అటు తిరిగింది తను. పెళ్ళినాటి ఫోటో. సిగ్గుచేత పుత్తడి బొమ్మ అయిన తను. ఆ బొమ్మను ఆనుకుని నిలబడ్డ ఆయన. మరొకవైపు భారంగా తిరిగింది మనస్సు. ఆ చప్పుడుకు గోడమీద రెండు బల్లులు పరుగుతీశాయి. అద్దంలో అందం బెదిరింది. పక్కవాటా వాళ్ళ కూతురూ, కొత్తల్లుడూ కలిసి తెగ నవ్వుకుంటున్నారు. దూరంగా సంతోషంతో అరుస్తున్న సినిమా డ్యూయెట్. వంటింట్లో గిన్నెలనాదం. అన్నీ బాధాకరం. అన్నీ కర్ణకఠోరం. కళ్ళు అశ్రుతప్తాలు కాబోతున్నాయి. గుండె ఎక్కడికో వెళ్ళి ఆ ప్రదేశం ఖాళీఅయి బాధపడుతూంది. లోపనితనం, ఒంటరితనం కలిసి శరీరంలో కుస్తీలు పడుతున్నాయి.

ఇన్ని అశక్తుల ప్రభావం భర్తకోసం, భర్త క్షేమంకోసం ఎదురుచూచే శారదను నిద్రలో ముంచేశాయి— కలలో రంగరించి, ఆవేదనలో ఆరగించి, ఆలోచనలో కరిగించి, అంతకు తప్ప మరేం చెయ్యలేక...

* * *

మరునాడు నేడై కొత్త ఆశలతో పుట్టింది. పదకొండు గంటలకుగాని పోస్ట్ రాదు. శారద

*"మీరూ మీ ఆవిడా ఎప్పుడూ దేన్ని గురించీ అభిప్రాయ భేదాలు రావూ?"*

*"ఏం, ఎందుకురావు? కాని ఆమాట మా ఆవిడదగ్గర మాత్రం అనను."*



నృత్య భంగిమ ఫోటో—ప్రభాకర్ మహాదిక్ (బొంబాయి-28)

# మిసెస్ శారద... పోస్ట్‌మన్

లేచింది. లేచీలేవడంతోనే మంగళసూత్రద్వయాన్ని కళ్ళ కద్దుకుంది. మొదట్లోనే సీతా రాముల్ని చూసింది. విశాఖపట్నం వెడుతూ ఆయన ఇచ్చిన "ఎస్" డిజైను ఉంగరం చూసుకుంది.

ఈ రోజైనా ఉత్తరం రావాలి. తప్పదు. లేకపోతే మనిషయినా రావాలి. లేకపోతే...లేకపోతే... లేకపోతే లేదు..—జరగదు. అంతే అనుకుంది. గట్టిగా నిండుగా.

కాలం ఆలోచనలతో పరుగు పందెం వేసుకుంది. భోజనం అయింది.

తెల్లని క్రేపు జార్జెట్ చీర నీలం పువ్వులు బోర్డరున్నది కట్టుకుంది. హంసలు వేసిన నీలం హాండ్‌లూమ్ జాకెట్ వేసుకుంది. మెడలో సన్నని చెయిన్. ఎర్రటి బొట్టు. నీలంగాజులు. కొత్తచీర శరీరానికి ఏదో అనుభూతిగా కితకితలు పెడుతూంది. ఈ అలంకారం దేనికి? తనకే తెలియదు. ఒక్కొక్క రోజు ఎందుకో ఆయనకు ఇష్టమైనట్లు ఉండడం తన కిష్టం. అంతే.

"ఎక్కడికే ప్రయాణం? మామయ్యగారింటికి గాని వెడతావా?"

"ఊ." జవాబు చెప్పలేక కాదు. తెలియక.

పదిముప్పై... ముప్పై ఒకటి...రెండు. ఐదు నలభై.

వంటింట్లో పెద్ద శబ్దం అయింది. శారద లోపలికు వెళ్ళింది. తలుపులు తీసి గడపమీద తల పెట్టుకుని నిద్రపోతూంది అమ్మమ్మ. తెల్లపిల్లి పాలగిన్నె వదిలి పరుగు పెట్టింది.

"ఏమండోయ్, సుబ్బలక్ష్మమ్మగారూ సుబ్బలక్ష్మమ్మగారూ..."

పక్క వాటాలో ఆవిడను పోస్ట్‌మన్ పిలుస్తున్నట్టున్నాడు. ఆవిడ భర్త వారం వియోగానికే రెండు ఉత్తరాలు వ్రాస్తాడు కనీసం—ఈ నాలుగో పుష్కరంలో కూడా.

తను పరుగున వెళ్ళింది వీధిలోకి. ఎడమవైపు గుమ్మం దగ్గర నిలుచున్నాడు పోస్ట్‌మన్. వీడెవడో కొత్తవాడులా ఉన్నాడు. పాతవాడు పోయాడు. పీడ పోయింది. అయినా వీడు సరిగా డెలివరీచెయ్యగలడా? కొంపతీసిఒకళ్ళవిమరొకరికి...

ఇంతలో సుబ్బలక్ష్మమ్మగారు నవ్వుతూ వచ్చి ఉత్తరం అందుకుని వెళ్ళిపోయింది. ఆ నవ్వులో ఏదో గొప్ప—చూడు నీకన్నా నయం అనే మూగార్థంతో

ఇదేమిటి పోస్ట్‌మన్ వెళ్ళిపోతున్నాడు? ఆగలేక అడిగింది: "మాకేం లేవా?"

పోస్ట్‌మన్ వెనుకనుంచే అన్నాడు—"మాకేం లేవా అనే పేరనేం ఉత్తరాలు లేవండీ"—అని.

తనకు ఒళ్ళు మండింది. వీడెవడో హాస్యం మాట్లాడుతున్నాడు అనుకుంది. తమాయించుకుని అడిగింది.

"అదేనోయ్. మిసెస్ శారద, కేరాఫ్ జగన్నాథ రావుగారు."

"ఆ....చూస్తా నుండండి" అన్నాడు.

"గోపాలరావు...రిటైర్డ్ టైరు కంపెనీ మానేజరు...

"సూర్యనారాయణ... బి.ఏ.; మిస్ సరోజిని..

"మిస్... వెంకట లక్ష్మి..." వాడు ఆగి—మీ పేరెవరన్నారు" అని తిరిగి ప్రశ్నించాడు.

"మిసెస్ శారద'' అంది ఆదుర్దాగా.

"మీరు మిస్ కారన్నమాట."

శారద ఉరిమి చూచింది. పోస్ట్‌మన్ అటు తిరిగి ఉన్నాడు. లేకట్లయితే ఏమయ్యేవాడో?

"ఉన్నాయా, మాకేమయినా?"

"మిసెస్....మిస్....మిస్సండీ" అన్నాడు.

శారద హృదయం భగ్నమంది. ఛీ. ఇలా ఉత్తరం కోసం, ఏమయినా సరే తను ఎదురుచూడకూడదనుకుంది. ఎంతగొప్ప? వారంక్రితం వస్తానన్న మనిషి కనీసం కారణం ఏమిటో వ్రాయలేకపోయారు. ఎదుట మనిషి ఆతృతమూ, ఆర్ద్రతమూ అర్థం చేసుకోలేని...

పోస్ట్‌మన్ ముందుకు పోతున్నాడు.

శారద వెనక్కు తిరిగింది.

"ఏమండోయ్" అన్నాడు కాంపౌండ్ గేట్ లోంచి పోస్ట్‌మన్.

"మిసెస్ శారద గారికి ఉత్తరం ఉందండి" అన్నాడు.

"ఆ...నే...నే" అంది ముందుకు వరుగున వెళ్ళి.

"ఈవిడయితే మిసెస్ శారదేగాని కేరాఫ్ మారేజ్ ఇన్‌ఫర్‌మేషన్ బ్యూరో..."

"ఏమిటయ్యా, అడ్రసులు సరిగా డెలివరీ చేసుకోలేని వాడివి ఉద్యోగం దేనికి?"

"ఈ వీధికి కొత్త అమ్మాయిగారూ. కొత్తలో అలాగే ఉంటుందండి ఎవరికైనా." చిన్నమొహం చేసుకుని ఉత్తరాలకట్ట చూసుకుంటున్నాడు. అన్ని ఉత్తరాలలో, అబ్బ, తనదే లేకపోవడం. ప్రతి ఉత్తరం తనను చూచి నవ్వుతున్నట్టనిపించింది.

నెమ్మదిగా భారంగా లోపలకు మళ్లింది శారద.

"ఏమండోయ్, ఇదిగో మిసెస్ శారద... ఉత్తరం ఉందండి..."

శారద ఆత్రుతగా క్షణంలో వెయ్యో వంతు కాలంలో ఉత్తరం అందుకుంది. కళ్ళు రత్నాలయ్యాయి. కెంపులయ్యాయి. అంతే క్షణములో చింపింది కవరు.

"మిసెస్ శారదగారూ—

మీ కంటి చివరి చూపుకోసం ఎన్నో రోజులుగా కనీసం సంవత్సరంగా ఎదురుచూస్తున్నా. ఇంతవరకూ అది నెరవేరలేదనే చెప్పుకోవాలి. కానీ ఆశ, నన్ను ఆకాశానికి ఎత్తుతూంది.... దానితో పాటు విహంగాన్నవడం తప్ప నేను మరేం చెయలేక పోతున్నాను. మీ రెవరైనా సరే, మీలో ఎన్ని లోపాలున్నా సరే మీరు నాకు కావాలి. నా దేవతగా పూజించుకుంటాను. మీతో తప్ప నాకు ఈ లోకంలో మరి దేనితోనూ నిమిత్తం లేదు. ఉన్నది ఏదైనా మీతోనే. మీ సాన్నిహిత్యంలోనే. మీ చూపుకోసం ప్రాణం ఇచ్చే...

పోస్ట్‌మన్...."

ఒళ్లు వేడెక్కిపోయింది. కళ్లలో నిప్పు రాజుకుంది.

"ఫూల్" అరిచింది. "నీ ఉద్యోగం తీయించేస్తాను—ఇటువంటి వెధవ్వేషాలు వేశావంటే. రాస్కెల్..."

"చూడండీ. ప్రేమించడం వెధవ పనని మీరంటే నేనేం చెప్పలేను. కానీ ప్రతివాళ్ళూ ప్రేమిస్తారు. మీరుమాత్రం ప్రేమించలేదా ఎవర్నీ? కాదనగలరా"... నవ్వుతూ అన్నాడు.

"బయటకు నడు...రోగ్. ఇడియట్..." గుండె మండి జ్వాలలు రేపుతూంది.

"ఒక్కసారి..."

శారదను వెడల్పాటి తన చేతులతో బంధించాడు పోస్ట్‌మన్—అరు బయట, వరండాలో, పదకొండు గంటల కాలంలో.... కాలమహిమ...

"ఛీ... వదులు..."

చెంప చెళ్ళుమంది రెండుసార్లు. టోపీ ఎగిరి పడింది. ఫ్రెంచ్ గడ్డం అక్కడక్కడ ఊడి చేతికొచ్చింది. చేతికి ఎర్రరంగయింది.



ఖరియా జాతి వనిత ఫోటో—ప్రసాద్ (ఢిల్లీ-8)

"శారదా." తీయని పిలుపు. ఆ లోకంలోకి ఆహ్వానించే పిలుపు. తనకు అలవాటైన గిలిగింత పెట్టే తలంపు.

"మీరా" అంది ముద్దుగా, గోముగా, ఆశ్చర్యంగా—అన్నీ సమానంగా కంఠంలో సమన్వయించగా.

"ఛా.., మీ స్నేహితురాలు మీరాబాయిని కాను, నేను సుబ్బారావును" అన్నాడు.

"ఛా. పాండీ, ఏమిటీ వాలింపు? ఉత్తరం కూడా వ్రాయడం మాని, చదువుపోయి ఆఖరికి పగటి వేషాలు వేయడం నేర్చుకున్నారు..."

సమాధానంగా నవ్వు.

శారద ఆ కౌగిలిమంచే అడుగుతూంది. తనకు తెలియదు ఎక్కడ ఉన్నదీ తను.

"యూనివర్శిటీలో 'లా'కు బదులుగా పగటి వేషాలు అడాప్ట్ చేస్తున్నారా?"

"నీకోసం, నీ సరదాకోసం, ఈ వేషం కాదు, చాలా వేషాలు వేయాలనిపిస్తుంది శారదా."

"అబ్బో—అన్నీ ఇక్కడి కబుర్లే" అంది పద్మంలా శారద.

"అంటే ఈ కౌగిల్లోనా" అన్నాడు భామడిలా సుబ్బారావు.

"వదలండీ... ఎవరైనా చూస్తే..."

"మీ పక్కవాటా పిన్నిగారుచూసి ఆశ్చర్యంలో బొమ్మ, దిమ్మ పోయి..."

"ఇంతకీ వేషం విశేషం?"

"ఆ... ఏం లేదు శారదా... యూనివర్శిటీ వాళ్ళు ఈ సంవత్సరం ఢిల్లీకి డెలిగేట్స్‌గా

# మిసెస్ శారద... పోస్ట్‌మన్

మమ్మల్ని పంపిస్తున్నారు. అక్కడి వెరైటీషోలో మన వేషం శ్రీమతిగారి ముందు 'ప్స్యూటనీ'కి పెట్టాం. మీరు కనిపెట్టలేకపోయారు. అనగా మిసెస్ శారద...మిస్..."

"అబ్బ అరవబోకండి. లోపలికి పదండి" అంది.

అలాగే ఇద్దరూ లోపలికి వెళ్లారు.

"శారదా, వాడెవడే? రామ...రామ..రామ. అయ్యో...రామా...'' అమ్మమ్మగారి బాధ.

"అమ్మమ్మగారు రామకోటి వ్రాయాలిగాని కంఠస్తోత్రం చేస్తే ముక్తిలేదండీ. నేను సుబ్బారావును".

"ఇదేం వేషం నాయనా?"

"మీ మనుమరాలి సరదా అండి ఇది. ఇలా వస్తే గాని దర్శనం ఇవ్వనంది.''

"ఓసి నీ యిల్లు బంగారంగానూ" అంది బామ్మగారు బోసినోటితో నవ్వుకుంటూ వంటిట్లోకి ఫేడౌట్ అవుతూ.

"ఏదీ కొంచెం బంగారం పెడ్తావూ.. మిస్ శారదా... కాదు... మిసెస్ శారదా సుబ్బారావు గారూ...కాదు...కాదు... మిసెస్ శారదా పోస్ట్‌మన్‌గారూ."

"ఊఁ" అంది మేఘమాలికలా మిసెస్ శారద అతని చేతుల్లోంచి మిస్ అవుతూ.

"ఊహూఁ'' అన్నాడు సాగదీస్తూ. గట్టిగా చెయ్యి పట్టుకుని, చందమామలా, సుబ్బారావులా, పోస్ట్‌మన్‌లా... ఆమెను మిస్ కాకుండా...

గోడమీద ఫోటోలో సీతారాములు సిగ్గుగా నవ్వుకున్నారు. అద్దం సిగ్గుచేత మరింత కంది పోయింది. దూలంమీద బల్లులు ఆశ్చర్యంగా చూచాయి. పక్క వాటాలో కొత్త జంట నవ్వు నూతిలో స్వరంలా అయిపోయింది శారదా సుబ్బారావులా సంతోషంలో. హాసంలో... ★

## జాలారి బాల

(51వ పేజీ తరువాయి)

సీత ముఖంలో ఆ జాలారి పూల పడుచు ముఖం చూసుకుంటూ, వీపుమీద మచ్చను తడివిచూసుకొని ఆ ఆనందప్రదమైన స్మృతుల్ని బలవంతంగా రేపుకుంటూ, అరగొండకు అప్పుడప్పుడూ వెళ్లి ఆ కొండ, కొండ వెనుక సూర్యాస్తమయం, సెలయేరు, మొగలిపొదలు చూసివస్తూ జీవితాన్ని లాగేశాను. కానీ డాక్టరు గారూ ! జీవితం చాలా విచిత్రమైంది. లేకుంటే నాకూ సీతకూ మధ్య ఉన్న ఈ రహస్యం ఈనాటి దాకా ఎందుకు బయటపడకపోవాలి ?. . .కానీ... మానవుడు కూడా చాలా దుర్బలుడు. . .కాకపోతే..." తలెత్తి భార్యకేసి చూసిన జగన్నాథం గారు ఆగిపొయ్యారు.

సీతాలక్ష్మమ్మగారి కళ్లలో నీళ్ళు చెంపల మీదికి జారబోతున్నాయి. ఆవిడ ముఖం ఒక ఆనందజ్యోతై వెలిగిపోతూంది.

"ఎందుకు, సీతా, అంత ఆనందం? అంత కన్నీళ్ళూ ?" జగన్నాథంగారు ప్రశ్నించారు.

ఆవిడ జవాబు చెప్పలేకపోయింది. జగన్నాథం గారూ, డాక్టరూ అలాగే నిశ్శబ్దంగా ఆవిడకేసి చూస్తున్నారు.

ఆవిడ ఏదో చెప్పబోయి అంతలో అంతటి వృద్ధాప్యంలో సిగ్గు ముంచెత్తుకురావడంతో అక్కడ నిలబడలేక లోపలికి వెళ్లిపోయింది.

షష్టిపూర్తి చేసుకోబోతున్న జగన్నాథం గారు ఒక్క అంగలో లోపలి కెళ్లారు. డాక్టరుగారి కేమీ అర్థంగాలేదు. ఏదో భావం అందీ అందకుండా వారి తలలో గిరికీలు కొడుతూంది. ఐదు నిమిషాల తర్వాత జగన్నాథంగారు తిరిగొచ్చారు. వారిని చూడగానే డాక్టరుగారు ఆశ్చర్యపోయారు. పరిచయమైన పదిహేనేళ్లనుంచీ ఇంత ఆనందంగా, ఇంత ఉల్లాసంగా జగన్నాథంగార్ని డాక్టరు గారు ఏనాడూ చూడలేదు. జగన్నాథంగారి ముఖం మబ్బులు వదిలిన ఆకాశంలా, కుబుసం ఊడ్చిన నాగంలా కాంతివంతంగా ఉంది. వారు వచ్చి సోఫాలో కూర్చుంటూ ఆనందంతో, తన్మయత్వంతో చెప్పుకుపోసాగారు.

"చూశారా డాక్టరుగారూ! నే చెప్పలేదూ? జీవితం చాలా విచిత్రమైంది. ఈరోజు నాకు చాలా ఆనందంగా ఉంది. . .కానీ ఒక్కటే చింత! జాలారి పూల పడుచు సంగతి సీత దగ్గర దాచి ఎంత ఆనందానికి దూరమయ్యానా అని. . . ఇంకో విషయమండోయ్. . .సీత ఇంకెప్పుడూ నన్ను రాత్తో రప్పతో కొట్టనని వాగ్దానం చేసింది." ★







పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్ట గ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-13) Jullundur City.**